

నేటి నుంచి ఎస్ఏ-1 పరీక్షలు

నరసన్నపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయి పరీక్షలు సమ్మోటివ్ అసెస్‌మెంట్-1ను స్వీయ మదింపు టర్మ్-1 పేరిట బుధవారం నుంచి నిర్వహించనున్నారు. అయితే కొన్ని పాఠశాలల్లో మాత్రమే ఉండే సంస్కృతం పరీక్షను సోమవారం నిర్వహించగా.. ప్రధాన పరీక్షలు అన్ని బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. 1 నుంచి 5వ తరగతి వరకు 11న తెలుగు, ఒరియా, 12న ఇంగ్లీష్, 13న గణితం, 16న ఈవీఎస్ పరీక్షలు నిర్వహిస్తారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు 11న తెలుగు, ఒరియా, 12న హిందీ, 13న ఇంగ్లీష్, 16న గణితం, 17న భౌతికశాస్త్రం, 18న జీవశాస్త్రం, 19న సోషల్ పరీక్షలు జరుగుతాయి.



సంచాం కొండపై గ్రావెల్ తవ్వకాలకు సిద్ధం చేసిన యంత్రం

వైసీపీ నేతకు.. కొండను రాసిచ్చేశారు

కూటమి ప్రభుత్వంలోనూ వైసీపీ నేతల హవా నడుస్తోంది. ఇంకా వైసీపీ అధికారంలో కొనసాగుతున్నట్టు కొందరు అధికారులు భావిస్తున్నారు. వైసీపీ నేతలకు కొండలను, గుట్టలను రాసిచ్చేస్తున్నారు. రణస్థలం మండలం సంచాం పంచాయతీలో ఇటువంటి అడ్డగోలు వ్యవహారం వెలుగులోకి వచ్చింది. గ్రామ సమీపంలో ఉన్న ఏడు ఎకరాల కొండలో గ్రావెల్ తవ్వకాల కోసం వైసీపీ నేతకు చెందిన ఓ ప్రైవేటు సంస్థకు అనుమతులివ్వడం ఆందోళన రేకెత్తిస్తోంది. సార్వత్రిక ఎన్నికల ఫలితాల మరుసటిరోజే ఈ ప్రక్రియ చేపట్టడం చర్చనీయాంశమైంది. సంచాంతోపాటు నాలుగు గ్రామాల ప్రజలు వ్యతిరేకించినా, స్థానిక తహసీల్దారు కలెక్టర్‌కు లేఖ రాసినా, స్థానిక ఎమ్మెల్యే అక్కడ గ్రావెల్ తవ్వకాలు వద్దని ప్రత్యేక లేఖ రాసినా.. ప్రైవేటు సంస్థ నిర్వాహకులు వెనక్కితగ్గడం లేదు. మంగళవారం గ్రావెల్ తవ్వకాలకు వారు సిద్ధమవ్వగా.. స్థానికులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. అధికారుల జోక్యంతో పరిస్థితి సద్దుమణిగింది.

- జూన్ 4న ఎన్నికల ఫలితాలు, 5న అనుమతులు
- వ్యతిరేకిస్తున్న నాలుగు గ్రామాల ప్రజలు
- లీజు రద్దు చేయాలని స్థానిక ఎమ్మెల్యే లేఖ
- అయినా గ్రావెల్ తవ్వకాలకు సిద్ధమైన వైనం
- ప్రజల అభ్యంతరంతో వివాదం
- సంచాంలో వెలుగు చూసిన అక్రమం



క్వారీ లీజ్ రద్దు చేయాలని ఆందోళన చేస్తున్న రైతులు

రణస్థలం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి)


రణస్థలం మండలం సంచాం పంచాయతీలో కొండపై గ్రావెల్ తవ్వకాల కోసం ఓ వైసీపీ నేతకు చెందిన ప్రైవేటు సంస్థకు అనుమతులివ్వడం వివాదాస్పదంగా మారింది. సంచాం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 89/6లో ఏడు ఎకరాల విస్తీర్ణంలో కొండ ఉంది. ఈ కొండ చుట్టూ పున్నానపాలెం, తిరుపతిపాలెం, అర్జునవలస, వేల్పురాయి గ్రామాలున్నాయి. ఈ కొండపై గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నేతల కన్నుపడింది. ఇంకేముంది గ్రావెల్ తరలించేందుకు అనుమతులు పొందారు. అయితే ఇక్కడే ఒక ట్విస్టు. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు ఈ ఏడాది జూన్ 4న రాగా.. 5న ఇక్కడి కొండపై వైసీపీ నేతకు చెందిన ప్రైవేటు సంస్థకు అనుమతిలిస్తూ భూగర్భ, గనుల శాఖ ఉత్తర్వులు జారీచేసింది. గత నెలలో ఇక్కడ కొండపై గ్రావెల్ తవ్వకాలకుగాను ఆ సంస్థ సిద్ధపడింది. దీంతో సంచాం, అర్జునవలస, పున్నానపాలెం, తిరుపతిపాలెం ప్రజలు తీవ్రంగా ప్రతిఘటించడంతో వివాదం ముదిరింది.

కొండతో ప్రయోజనం..

ఆ నాలుగు గ్రామాల ప్రజలకు కొండే ఆధారం. ఈ ప్రాంతంలో పశువులను కొండపై మేతకు విడిచిపెడుతుంటారు. వర్షాకాలంలో కొండపై నుంచి జారిపడే నీరు సాగుకు ఉపయోగపడుతోంది. మరోవైపు ప్రభుత్వం కొండ చుట్టూ దళితులకు పెద్ద ఎత్తున డీ-పట్టా భూములు అందించింది. ఇక్కడ గ్రావెల్ తవ్వకాలు చేపడితే రహదారులు ధ్వంసమవుతాయని, పంటలు పాడవుతాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఈ నాలుగు గ్రామాల ప్రజలు వ్యాధులతో బాధపడుతున్నారు. ఇప్పుడు కొండ రూపంలో ఉన్న పచ్చదనం హరిస్తే ఇబ్బంది పడతామని చెబుతున్నారు. అందుకే కొండపై గ్రావెల్ తవ్వకాలకు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

అధికారులు, ఎమ్మెల్యే లేఖ రాసినా..

గ్రావెల్ తవ్వకాలు అడ్డుకోవాలని ప్రజల ఫిర్యాదు మేరకు ఇటీవల ఆర్‌ఐతోపాటు (మిగతా 6వ పేజీలో..)



సీఎం చంద్రబాబు



కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



ఎస్పీ మహేశ్వరరెడ్డి



ప్రగతి దిశగా..

- అమరావతిలో నేటి నుంచి కలెక్టర్ల సదస్సు
- ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహణ
- నివేదికతో పయనమైన కలెక్టర్, ఎస్పీ

శ్రీకాకుళం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): అమరావతిలో బుధవారం నుంచి సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో రెండు రోజులపాటు కలెక్టర్ల సదస్సు నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లానుంచి ప్రగతి నివేదిక, అవసరమైన నిధులు.. ప్రభుత్వం నుంచి కావాల్సిన సహకారం.. ప్రభుత్వ పథకాల అమలులో ప్రస్తుతం ఉన్న ర్యాంకింగ్.. ఇలా సమగ్ర నివేదికను అన్ని విభాగాల నుంచి తీసుకుని రాజధానికి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పయనమయ్యారు. ఆయనతోపాటు సమీక్షలో ఎస్పీ మహేశ్వరరెడ్డి కూడా పాల్గొనున్నారు. సదస్సులో సిక్కోలు ప్రగతి కోసం వివిధ అంశాలపై ప్రస్తావిం చనున్నారు. ప్రధానంగా 'విజన్ ఆంధ్రా- 2047' లక్ష్యంగా సిద్ధం చేసిన నివేదికపై చర్చిస్తారు. జీవీఏ(గ్రాస్ వాల్యూయాడెడ్) .. రాష్ట్ర ఉత్పత్తిలో పోల్చితే వ్యవసాయ అనుబంధ రంగాల్లో జిల్లాకు 19వ ర్యాంకు వచ్చింది. రాష్ట్ర వాటాలో ఇది 2.89శాతం మాత్రమే. అలాగే పరిశ్రమ రంగాలకు సంబంధించి 20వ ర్యాంకు, సేవా రంగంలో 15వ ర్యాంకు లభించింది.

- ఉపాధి హామీ పథకానికి సంబంధించి.. వేతనదారుల బడ్జెట్ 2025 మార్చి 31 నాటికి రూ.2.13 కోట్లు. ఇప్పటికి 163.99 పని దినాలు వేతనదారులకు కల్పించారు. ఇక కొత్త ఆర్థిక సంవత్సరం వరకు మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.327.46 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది. ఇప్పటివరకు రూ. 89.52 కోట్లు ఖర్చు చేశారు. జలజీవన్ మిషన్‌లో భాగంగా రూ. 1102.45 కోట్లతో జిల్లాలో 1,696 పనులు జరుగుతున్నాయి.
- ఇసుక నిల్వలకు సంబంధించి ప్రస్తుతం 12 రీచ్‌లు ఉన్నాయి. ఇందులో 10 రీచ్‌ల నుంచి ఇసుకను తరలిస్తున్నారు. స్థానిక అంశాల కారణంగా రెండు రీచ్‌ల నుంచి ఇసుకను తరలించడంలేదు. ప్రత్యేకంగా ఎనిమిది చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. శ్రీకాకుళం నుంచి విశాఖపట్టణం జిల్లాకు ఇసుక ఇచ్చేందుకుగాను రీచ్‌లు.. ప్రత్యేక ప్రాంతాలు గుర్తించేందుకు యాక్షన్ ప్లాన్ రూపొందించారు.

ప్రగతి పరుగులు ఇలా...

- జిల్లా స్థూల ఉత్పత్తి 2022-23లో మొత్తం రూ.37,282 కోట్లుగా నమోదైంది. 2028-29కు గాను ఇది రూ.83,792 కోట్లు కావాలన్న లక్ష్యంతో ప్రణాళికను సిద్ధం చేశారు.
- గ్రామ, వార్డు సచివాలయాల్లో 2,09,677 మందికి సంబంధించిన రికార్డులు పర్యవేక్షించాల్సి ఉంది. ఇందులో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, రెవెన్యూ, భూ, డిస్కమ్స్, ట్రాన్స్‌పోర్టు తదితరమైనవి ఉన్నాయి. వీటిలో 5,900 రికార్డులను పరిశీలించి చర్యలు తీసుకున్నారు.
- ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్ధిదారులకు చేర్చేందుకు వారి బ్యాంకు ఖాతాలను ఎన్‌పీసీఐ చేయించుకోవాల్సి ఉంది. శ్రీకాకుళం జిల్లాలో 2,51,220 మంది ఖాతాలు ఇన్‌యాక్టివ్‌లో ఉన్నాయి. వీటిలో 2,46,353 ఖాతాలు ఎన్‌పీసీఐతో అనుసంధానమయ్యాయి. ఇంకా 4,867 ఖాతాలు అనుసంధానం చేయాల్సి ఉంది. ప్రస్తుతం హౌస్ హోల్డ్ సర్వే 97.05 శాతం పూర్తయింది.
- వార్డు, గ్రామ (మిగతా 6వ పేజీలో..)



పలాసలోని కిడ్నీ పరిశోధన కేంద్రం..

ఇన్నాళ్లూ.. ఉచిత సేవేనా!

- కిడ్నీ పరిశోధన కేంద్రం ఒప్పంద సిబ్బందికి అందని వేతనాలు
- వైసీపీ తీరుతో ఆర్థికంగా ఇబ్బందులు
- కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కదలిక
- ఆప్కాస్‌లో నమోదుకు ఎమ్మెల్యే శిరీష కృషి

పలాస, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పలాసలోని కిడ్నీ పరిశోధన కేంద్రం-200 పడకల ఆస్పత్రిలో ఒప్పంద సిబ్బందికి ఇన్నాళ్లూ ఉచిత సేవే మిగిలింది. కిడ్నీ పరిశోధన కేంద్రాన్ని, 200 పడకల ఆస్పత్రిని తామే నిర్మించి.. రోగులకు సేవలు అందజేస్తున్నామని గొప్పలు చెప్పుకున్న గత వైసీపీ ప్రభుత్వం.. అందులో పని చేస్తున్న సిబ్బందితో వెట్టిచాకిరి చేయించుకొని వేతనాలు ఇవ్వకుండా కాలయాపన చేసింది. ఏకంగా 15 నెలలుగా జీతాలు లేక సిబ్బంది ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. వారికి సాక్షాత్తు కలెక్టర్ నియామక పత్రాలు అందించినా ఇప్పటివరకూ ఆప్కాస్ (ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ)లో వారి పేర్లు నమోదు కాకపోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. వారి గోడు విన్న పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష.. ఇటీవల అసెంబ్లీలో ఈ అంశాన్ని లేవనెత్తారు. దీంతో పాటు రెండు రోజుల కిందట ఆప్కాస్‌లో వారి వివరాలు నమోదు చేయించి వేతనాలు వచ్చే విధంగా కృషి చేస్తున్నారు.

- పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటి పద్మనాభపురం గ్రామం వద్ద కిడ్నీ పరిశోధన కేంద్రాన్ని 2023లో అప్పటి సీఎం జగన్ ప్రారంభించారు. 2023 అక్టోబరు నాటికే మొత్తం 52 మంది సిబ్బందిని ఆప్కాస్ ద్వారా ఎంపిక చేసి వారితో పనులు చేయించడం ప్రారంభించారు. ల్యాబ్ టెక్నీషియన్లు, ఏఎస్ఎంలు, ఔషధ సిబ్బందితో పాటు మిగిలిన సిబ్బందిని విధుల్లోకి చేర్చుకున్నారు. వారి స్థాయిని బట్టి రూ.18,500 నుంచి రూ.30 వేల వరకూ వారికి ప్రతినెలా వేతనాలు చెల్లించాలి. ఆస్పత్రి ప్రారంభించిన తరువాత వేతనాలు ఇస్తారని అంతా ఊహించారు. అయితే త్వరలో అందజేస్తామంటూ అధికారులు కాలయాపన చేశారు. ఇంతలో సార్వత్రిక ఎన్నికలు సమీపించాయి. ఎన్నికల తర్వాత వేతన బకాయిలన్నీ ఒకేసారి అందజేస్తామని అధికారులు చెప్పి.. వారితో పనులు చేయించుకున్నారు. ఎన్నికల ఫలితాల్లో వైసీపీ ఓడిపోయింది. కూటమి అధికారంలోకి వచ్చింది. దీంతో కొత్త ప్రభుత్వం ఏర్పాటు, అధికారులు మారడం, ఆప్కాస్‌పై తలో ప్రచారం చేయడంతో సిబ్బంది సందిగ్ధంలో పడ్డారు. తాము ఎవరిని వేతనాలు అడగాలో తెలియక అయోమయం చెందారు. వైసీపీ ప్రభుత్వ తీరుతో 15 నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నామని.. తమకు న్యాయం చేయాలని ఇటీవల పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష వద్ద సిబ్బంది మొరపెట్టుకున్నారు. దీనిపై ఆమె స్పందిస్తు అసెంబ్లీలో ఈ అంశాన్ని తొలుత ప్రస్తావించారు. అనంతరం కలెక్టర్‌కు విషయం చెప్పడంతో మొత్తం వివరాలు ఆప్కాస్‌లో నమోదు చేయిం చారు. రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి కూడా ఈ అంశం వెళ్లడంతో వేతనాలు, ఆప్కాస్ అంశాలు వెలుగు చూశాయి.
- ఇదిలా ఉండగా వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒప్పంద కార్మికుల నియమకాల్లో భారీ దందా జరిగినట్లు ప్రచారం జరుగుతోంది. రూ.కోట్లలో చేతులు మారాయని స్పష్టమవుతోంది. దీని కారణంగానే సిబ్బంది కూడా గత ప్రభుత్వ పెద్దలపై వేతనాల కోసం ఒత్తిళ్లు తీసుకురాలేదని తెలుస్తోంది. ఈ వ్యవహారంపై పలాస ఎమ్మెల్యే శిరీష వద్ద ప్రస్తావించగా ఆప్కాస్‌లో సిబ్బంది పేర్లు నమోదు చేయించామన్నారు. గత ప్రభుత్వం హయాంలో ఉద్యోగాలు పొందిన వారికి కనీసం వేతనాలు ఇవ్వాలన్న జ్ఞానం కూడా లేకపోవడాన్ని తప్పుబట్టారు. సిబ్బంది సమస్యలు పరిష్కరిస్తామని, త్వరలోనే వేతనాలు మంజూరు చేసేలా కృషి చేస్తామని తెలిపారు.

రుక్కి ఫారెస్ట్‌లో.. పెద్ద పులి

- పాదముద్రలు గుర్తించిన అటవీ అధికారులు
- అప్రమత్తంగా ఉండాలని గిరిజనులకు సూచన

హరిపురం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మహేంద్ర గిరుల నుంచి మందస వరకు వ్యాపించి ఉన్న రుక్కి ఫారెస్ట్‌లో పెద్ద పులి సంచరిస్తుందనే ప్రచారం స్థానికుల్లో అలజడి రేపుతోంది. రుక్కి ఫారెస్ట్ సమీపంలోని చీపి, బొందికారి, లొడకపెట్టి, కారిగాం, బుడంబో, బావనాపురం తదితర గ్రామాల గిరిజనుల్లో భయం పట్టుకుంది. ఒడిశా (మిగతా 6వ పేజీలో..)



చీపి వద్ద పులి పాదముద్రలను గుర్తిస్తున్న డీఆర్వో రామ



కేంద్ర న్యాయ శాఖ మంత్రితో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే శిరీష

ఓబీసీ ప్రక్రియ వేగవంతం చేయాలి

- కేంద్ర సామాజిక, న్యాయ శాఖ మంత్రిని కోరిన పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు

శ్రీకాకుళం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన ఉత్తరాంధ్రలోని తూర్పుకాపు, కళింగవైశ్య, శిష్టకరణం, సొండి, అవర కులాలను ఓబీసీ జాబితాలో చేర్చాలని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు కోరారు. దీనిపై పదేళ్లుగా పార్లమెంట్‌లో ఎన్సీబీసీ కమిషన్‌లో పోరాడుతున్న విషయాన్ని గుర్తుచేశారు. ఈ మేరకు విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషతో కలిసి కేంద్ర సామాజిక, న్యాయశాఖ మంత్రి డాక్టర్ (మిగతా 6వ పేజీలో..)

తీరంలో వైసీపీ నేతల ఆక్రమణ

- అడ్డుకున్న ఎంపీటీసీ
- ఇరువర్గాల మధ్య వాగ్వాదం

హరిపురం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మందస మండలం బేతాళపురం వద్ద సముద్ర తీరం ఆక్రమణకు గురైంది. సముద్రానికి ఆనుకుని సుమారు 500 మీటర్ల వరకు ఎలాంటి నిర్మాణాలు, ఆక్రమణలు చేపట్టరాదనే నిబంధనలను గ్రామానికి చెందిన వైసీపీ యువ నాయకులు తుంగలో తొక్కారు. తీరంలోని ప్రభుత్వ భూములు ఆక్రమించి ఇటీవల కొబ్బరి, జీడి చెట్లు నాటారు. ఆ ప్రాంతం గుండా సముద్రానికి రహదారి ఉంది. చేపల వేటకు వెళ్లే మత్స్యకారులకు ఈ రహదారే ప్రధానం. కాగా ఆక్రమణ చేపట్టిన వైసీపీ నాయకులు రహదారికి అడ్డంగా మంగళవారం కంకర పోగులు వేశారు. మత్స్యకారులు (మిగతా 6వ పేజీలో..)



ఆక్రమిత స్థలంలో రోడ్డుకు అడ్డంగా వేసిన కంకర పోగులు



మెళియాపుట్టిలో సాగు చేస్తున్న డ్రాగన్ పంట

ఆదాయం.. ఆరోగ్యం

- డ్రాగన్ పంట సాగుతో లాభాలు
- మన్యంలో పెరుగుతున్న విస్తీర్ణం

మెళియాపుట్టి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి)

● మెళియాపుట్టి పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న జగన్ దీనబంధుపురం సమీపంలో ఎకరా పొలంలో గత ఏడాది డ్రాగన్ పంట వేశారు. దీని కోసం రూ.5 లక్షల నుంచి రూ.7లక్షల వరకు ఖర్చయింది. ఏడాదిలో రూ.3 లక్షల నుంచి రూ.ఐదు లక్షల ఆదాయం వచ్చినట్టు చెబుతున్నారు. వచ్చే ఏడాది నుంచి ఆదాయం పెరుగుతుందని అంటున్నారు. ఒకసారి మొక్క నాటితే 20 నుంచి 30 ఏళ్ల వరకు ఆదాయం వస్తుందని చెబుతున్నారు.

● మెళియాపుట్టి మండలం చీపురుపల్లి గ్రామానికి చెందిన షణ్ముఖరావు అనే రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి తన ఇంటి మిద్దె పైనే డ్రాగన్ పంట వేశారు. దీని ద్వారా ప్రతి నెల రూ.10 వేల వరకు ఆదాయం వస్తోందని చెబుతున్నారు.

జిల్లాకు అనుకూలం..

డ్రాగన్ పంట సాగుకు జిల్లా అనుకూలంగా ఉంటుందని ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లాలో ప్రస్తుతం 20 హెక్టార్లలో పంట సాగు చేస్తున్నట్లు చెబుతున్నారు. జిల్లాలో మెట్ట ప్రాంతం అధికంగా ఉంది. ఈ ప్రాంతంలో జీడి, మామిడిని ఎక్కువగా సాగు చేస్తున్నారు. వీటి వల్ల అంతగా ఆదాయం రాక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో కొంతమంది డ్రాగన్ పంటను ప్రయోగాత్మంగా సాగు చేశారు. మంచి ఫలితాలు కనిపించడంతో మరికొంత మంది దీని సాగుకు మక్కువ చూపుతున్నారు. డ్రాగన్‌లో ఎన్నో పోషకాలు ఉన్నాయని వైద్యులు చెబుతుండడంతో మార్కెట్‌లో వీటికి మంచి డిమాండ్ ఉంటోంది. సీజన్‌ను బట్టి కిలో రూ.200 నుంచి రూ.250 వరకు పలుకుతోంది.



పండ్లు కోస్తున్న రైతులు

30 ఏళ్ల వరకు దిగుబడి..

ఒకసారి డ్రాగన్ మొక్కలు నాటితే 30 ఏళ్ల వరకు దిగుబడులు వస్తాయని అధికారులు చెబుతున్నారు. మన భూములు అనుకూలంగా ఉండడంతో పంట వేసుకుంటే మంచిదని సూచిస్తున్నారు. జిల్లాలో ఎక్కువగా మెళియాపుట్టి, పాతపట్నం, కొత్తూరు, హిరమండలం, నందిగాం మండలాల్లో డ్రాగన్ వేస్తున్నారు. ఈ ఏడాది జిల్లాలో దీని సాగు విస్తీర్ణం పెరిగింది. వచ్చే ఏడాది నుంచి ఇంకా పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

మంచి లాభాలు..

డ్రాగన్ 25 ఏళ్ల పాటు దిగుబడినిస్తుంది. ఎకరాకు ఐదు నుంచి పది టన్నుల దిగుబడి ఉంటుంది. టన్ను రూ.50 వేల నుంచి రూ.90 వేల వరకు ధర పలుకుతుంది. మొక్క వయస్సు పెరిగేకొద్దీ దిగుబడులు బాగుంటాయని ఉద్యానవన శాఖ అధికారులు చెబుతున్నారు. సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే మొదటి ఏడాదే పెట్టుబడి తిరిగి వస్తుందని అంటున్నారు. 15 రోజులకొకసారి పండ్లు కోతకు వస్తాయి.

డ్రాగన్‌లో పోషకాలు మెండుగా ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్లు, విటమిన్-సి, ఐరన్, మెగ్నీషియం వంటి విలువైన పోషకాలు ఉంటాయని అంటున్నారు. బరువు నియంత్రణకు సహకరిస్తుందని తెలిపారు. వినియోగానికి తగ్గట్టు దిగుబడులు లేక పోవడంతో ప్రస్తుతం ధర ఎక్కువగా ఉంటోంది. గతంలో విదేశాల నుంచి దిగుమతి చేసుకునే వారు. ప్రస్తుతం స్థానికంగా దొరుకుతున్న పండ్ల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు.



కలెక్టర్‌కు డ్రాగన్ పండ్లను చూపిస్తున్న స్థానికులు

మన నేలకు అనువైనది..



రైతులు డ్రాగన్ పంట వేస్తే పూర్తిగా సహకరిస్తాం. ఇది మన నేలకు అనువైన పంట. డ్రాగన్ వేసిన వారు మంచి లాభాలు పొందుతున్నారు. నీటి వనరులు ఉన్న ప్రాంతంలో పంట వేసుకోవాలి. చిన్న, సన్నకారు రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇస్తుంది.

-దక్క శరత్‌రెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి

కష్టపడితే లాభమే..



డ్రాగన్ పంట సాగులో కష్టపడిన వారికి మంచి లాభాలు ఉంటాయి. ప్రయోగాత్మకంగా పంట వేశాను. కానీ దిగుబడులు బాగా వస్తున్నాయి. రసాయనాలు వాడకుండా పండిస్తున్నాం. గత ఏడాది ఎకరంలో సాగు చేశాను. మంచి దిగుబడులు వచ్చాయి.

-జగన్, రైతు

ప్రోత్సాహకాలు..

డ్రాగన్ పంట వేసిన రైతులకు ఉద్యానవన శాఖ ద్వారా ప్రోత్సాహకాలు అందిస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. మెళియాపుట్టిలో సాగు వివరాలను ఇటీవల కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వచ్చే ఏడాది నుంచి సాగు విస్తీర్ణం పెరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సాధారణ రైతులలకు దీని సాగుకు ప్రభుత్వ పరంగా ఒక హెక్టార్‌కు రూ.35 వేల వరకు ప్రోత్సాహకంగా ఇస్తామని చెప్పారు. ఉపాధి జాబ్ కార్డు ఉన్న వారికి రూ.1.50 లక్షలు ఇవ్వనున్నట్టు చెప్పారు.

'ప్రగతి' దిశగా..

(ఐదో పేజీ తరువాయి)

సచివాలయాలు మొత్తం 732 ఉన్నాయి. వీటిలో 6,434 మంది ఉద్యోగులు ఉన్నారు. వీరిలో 4,803 మంది ఉద్యోగులకు సంబంధించిన హాజరును మార్క్ చేశారు. 1631 మంది హాజరును గుర్తించలేకపోయారు. ఇక డెప్యుటేషన్‌లో 44 సచివాలయాల్లో ఉద్యోగులు పని చేస్తున్నారు.

● పీఎంఎఫ్‌బీవై (బీమా)కి సంబంధించి కేవలం 332 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు.

● వ్యవసాయ సహకార పరపతి సంఘాల కంప్యూటరీకరణ జిల్లాలో 92శాతం పూర్తయింది.

● జిల్లాలో గోకులాల నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చిన టార్గెట్ 1050. అయితే 1157 గోకులాలకు అనుమతి ఇచ్చారు. పశు కిసాన్ క్రెడిట్ కార్డులను 3,525 మందికి ఇవ్వాల్సి ఉండగా.. ఇప్పటికి 1,937 మందికి పంపిణీ చేశారు.

● జిల్లాలో ప్రస్తుతం గుర్తించిన అటవీ ప్రాంతం 445.75 చ.కిమీ. ఇందులో బయట ప్రాంతాల్లో చెట్లు ఉన్న ప్రాంతం 547.24 చ.కిమీ. రాష్ట్రంలోని హరిత ప్రాంతాన్ని పోల్చితే జిల్లాలో 21.63 శాతం ఉంది.

● జిల్లా ప్రజల తాగునీటి అవసరాలకు 50.2 ఎం.ఎల్.డి. నీరు అవసరం. ప్రస్తుతం 28.5 ఎంఎల్‌డీ మాత్రమే అందుబాటులో ఉంది. కొత్త ప్రాజెక్టుల ద్వారా 37.4 ఎంఎల్‌డీ నీటిని ఇచ్చేందుకు వీలుంది. ఇంకా 15శాతం లోటులోనే ఉంది.

● జిల్లాలో కుక్కల బెడద విపరీతంగా ఉంది. మొత్తం 4,080 కుక్కలకు వ్యాక్సిన్ వేయాల్సి ఉంది. ఇప్పటికి 1,040 శునకాలకు మాత్రమే వ్యాక్సిన్ వేశారు.

● ప్రస్తుతం జిల్లాలో 5 అన్న క్యాంటీన్లు నిర్వహిస్తున్నారు. మరో 4 ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

● రోడ్లపై గుంతలు పూడ్చే కార్యక్రమంలో జిల్లా వెనుకబడింది. మొత్తం 582 పనులు చేపట్టాల్సి ఉండగా.. 53 మాత్రమే పూర్తి చేశారు. ప్రగతి 9.1 శాతమే.

● 3,536 టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. వీటిలో ఇప్పటి వరకు 2.720 ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించారు.

● జిల్లాలో దేవాలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల ఈ రెండేళ్ల కాలంలో 38 దేవాలయాల్లో చోరీ ఘటనలకు సంబంధించి కేసులను పోలీసులు చేధించారు. మొత్తం 120 కేసులు నమోదు చేసి రూ.1.72 కోట్ల విలువ గల దేవాలయాల సొత్తును రికవరీ చేశారు.

● మూలపేట పోర్టుకు సంబంధించి 4,691 ఎకరాల భూ సమస్యను ప్రాధాన్య అంశాలలో ప్రభుత్వం చేర్చింది.

● పైడిభీమవరంలో 'డీశాలినేషన్ ప్లాంట్' ఏర్పాటుకు భూమి అవసరమని ప్రతిపాదించారు. ఈ ప్రాజెక్టు ద్వారా 34 ఎంఎల్‌డీ సాగర జలాన్ని శుద్ధిచేసి తాగునీటిగా మార్చుకునేందుకు వీలుంటుంది. ప్రస్తుతం భూసేకరణ చేస్తున్నారు.

● బీఎస్ఎన్ఎల్ ఆధ్వర్యంలో జిల్లాలో దబారు, కూర్మనాథపురంలో కొత్తగా సెల్‌టవర్లను ఏర్పాటు చేయనున్నారు. ఈమేరకు భూమి కేటాయించాలని తహసీల్దారులకు ప్రతిపాదనలు పంపారు.

● మూలపేట పోర్టు విషయానికొస్తే.. 408.67 ఎకరాల ప్రభుత్వ భూమి, 77.72 ఎకరాల పట్టా భూమి ఉంది. ఆర్అండ్ఆర్‌కు సంబంధించి రూ.40.40 కోట్ల చెల్లింపులు పూర్తయ్యాయి.

● జిల్లాలో ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు ప్రతిపాదన సిద్ధమైంది. ఈ నెల 15వ తేదీ నాటికి స్థలం ఖరారు చేసేందుకు ప్రణాళికను సిద్ధం చేశారు.

● ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన కింద ఇప్పటి వరకు 63,467 రిజిస్ట్రేషన్లు జరిగాయి.

● ప్రసాద్ పథకంలో అరసవల్లి శ్రీసూర్య నారాయణ స్వామివారి దేవస్థానాన్ని చేర్చారు. దీనికి అత్యంత ప్రాధాన్యమిస్తూ టూరిజం మంత్రిత్వ శాఖలో చేర్చారు.

● జిల్లాలో విద్యా విభాగానికి సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన రేటింగ్స్‌లో... '0' స్టార్ సాధించిన పాఠశాలలు 4 ఉన్నాయి. ఒక స్టార్ సాధించినవి 599, రెండు స్టార్‌లు సాధించినవి 1620, 3 స్టార్‌లు సాధించినవి 410, నాలుగు స్టార్‌లు సాధించినవి 5 ఉన్నాయి. ఐదుస్టార్ల రేటింగ్ సాధించిన పాఠశాలలు ఒక్కటీ లేదు.

● సర్వేరాళ్లపై పేర్ల తొలగింపులో భాగంగా ఇప్పటి వరకు జిల్లాలో 649 గ్రామాలకు సర్వే రాళ్లను పంపిణీ చేశారు. మొత్తం 8,22415 రాళ్లను వేశారు. 1,58,057 రాళ్లపై జగన్ ఫొటోలను తొలగించారు.

● జిల్లా రిజిస్ట్రేషన్ అండ్ స్టాంపుల శాఖ నుంచి ఈ ఆర్థిక సంవత్సరానికి గాను రూ.273.14 కోట్లు లక్ష్యం ఉండగా.. ఇప్పటి వరకు రూ. 123.10 కోట్లకు చేరుకోగలిగారు.

● ఇప్పటి వరకు దేవదాయ శాఖకు చెందిన విలువైన భూముల్లో 37,994 చదరపు యార్డులలో ఆక్రమణలు తొలగించగలిగారు.

రుక్కి ఫారెస్ట్‌లో.. పెద్ద పులి

(ఐదో పేజీ తరువాయి)

నుంచి ఆంధ్రా ప్రాంతానికి పెద్దపులి తరలి వచ్చినట్టు అక్కడి అధికారుల ద్వారా అటవీ శాఖకు సమాచారం అందింది. ఈ నేపథ్యంలో డీఆర్వో రాము ఆధ్వర్యంలో అటవీశాఖ సిబ్బంది లక్ష్మణమూర్తి, పోలయ్య, వెంకటేష్, జోగారావు తదితరులు మంగళవారం రుక్కి ఫారెస్ట్ ప్రాంతంలో పర్యటించారు. బావనాపురం- బుడంబో రహదారి, భావనాపురం చెరువువద్ద బురదలో పులి పాదముద్రలు గుర్తించారు. ఆ పులి రుక్కి కొండల్లోకి వెళ్లినట్లు తెలుసుకున్నారు. మహేంద్రగిరులు తరువాత అంతే ప్రాముఖ్యత చెట్లు ఉండే ప్రాంతం రుక్కి కొండలు.. పులి ఉండేందుకు అనువైన ప్రాంతంగా అధికారులు భావిస్తున్నారు. దీంతో ఈ ప్రాంత ప్రజలు ప్రధానంగా రాత్రిసమయాల్లో బయట తిరగ వద్దని హెచ్చరించారు. రాత్రి వేళల్లో పొలాలకు వెళ్ల రాదని, పగలు సైతం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డీఆర్వో రాము మాట్లాడుతూ గత ఏడాది ఇదే సీజన్‌లో ఒడిశా నుంచి ఆంధ్రా పాంతానికి పెద్దపులి వచ్చి.. తిరిగి ఒడిశా అడవుల్లోకి వెళ్లిందన్నారు. ఈ ఏడాది అదే మాదిరి మళ్లీ సంచరిస్తోందని ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కోరారు.

తీరంలో వైసీపీ నేతల ఆక్రమణ

(ఐదో పేజీ తరువాయి)

లబోదిబోమంటూ తమ తోటి మత్స్యకారుడు, ఎంపీటీసీ సూరాడ వాసుకు ఈ విషయాన్ని తెలియజేశారు. వారంతా వెళ్లి కంకర వేస్తున్న ట్రాక్టర్‌ను అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. వైసీపీ నాయకులు ఎంపీటీసీని అంతమొందిస్తానని హెచ్చరించడంతో.. టీడీపీ వర్గీయులు భయాందోళనకు గురయ్యారు. ఈ విషయమై ఎంపీటీసీ వాసు మందస పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలియజేశారు. ఆక్రమణపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నామని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు.

వైసీపీ నేతకు... కొండను రాసిచ్చేశారు

(ఐదో పేజీ తరువాయి)

సర్వేయర్, వీఆర్వో ఆ కొండను పరిశీలించారు. ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఇదే విషయంపై గత నెల 19న రణస్థలం తహసీల్దారు.. కలెక్టర్‌కు లేఖ రాశారు. ఇక్కడ కొండపై గ్రావెల్, మట్టి తవ్వకాలు చేపడితే ప్రజా జీవనానికి విఘాతం కలుగుతుందని.. అందుకే ఇక్కడ అనుమతులు రద్దు చేయాలని ఆ లేఖలో పేర్కొన్నారు. మరోవైపు నాలుగు గ్రామస్థుల నుంచి వచ్చిన ఫిర్యాదులతో స్థానిక ఎమ్మెల్యే నడుకుదుటి ఈశ్వరరావు సైతం స్పందించారు. కొండపై గ్రావెల్ తవ్వకాలకు సంబంధించి అనుమతులు రద్దు చేయాలని రెవెన్యూ అధికారులను కోరారు. ఇంతలో మంగళవారం ఒక్కసారిగా ప్రైవేటు సంస్థ ప్రతినిధులు యంత్రాలతో కొండ వద్దకు చేరుకున్నారు. గ్రావెల్ తవ్వే ప్రయత్నం చేయగా ప్రజలు అడ్డుకున్నారు. తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా అధికారులు సముదాయించారు.

● ఆ ఎమ్మెల్యే సహకారంతోనే?

ఈ ప్రాంతంలో గ్రావెల్‌కు విపరీతమైన గిరాకీ. పారిశ్రామికవాడతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో గృహ నిర్మాణాలకు గ్రావెల్ అవసరం ఎక్కువ. అందుకే ఏడు ఎకరాల భూమిలో కోట్లాది రూపాయల గ్రావెల్, మట్టి తరలించుకుపోవాలని వైసీపీ నేత ప్లాన్ చేశారు. పూర్తిగా కొండ కైంకర్యం అయిన తరువాత.. ఆస్థలాన్ని సైతం స్వాధీనం చేసుకునే కుట్ర చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అయితే అక్రమాలకు పాల్పడేది వైసీపీ నేత. కానీ ఆయన వెనుక ఉన్నది మాత్రం మరో నియోజకవర్గానికి చెందిన అధికార పార్టీ ఎమ్మెల్యేగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆయనే తెర వెనుక ఉండి ఈ తతంగం జరిపిస్తున్నట్టు విమర్శలు వస్తున్నాయి. రెవెన్యూ అధికారులు, పోలీసులను సైతం ఈ విషయంలో తమకు సహకరించాలని ఆ ఎమ్మెల్యే కోరినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి ఈ క్వారీ అనుమతులు రద్దు చేయాలని నాలుగు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి..

సంచాం కొండపై గ్రావెల్ తవ్వకాలను నాలుగు గ్రామాల ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. ఎన్నికలకు ముందు అప్పటి అధికారులు అనుమతులిచ్చారు. స్థానికుల నుంచి వస్తున్న వ్యతిరేకతను దృష్టిలో పెట్టుకొని ఉన్నతాధికారులకు లేఖ కూడా రాశాను. మరోసారి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా.

-ఎన్.ప్రసాద్, తహసీల్దారు, రణస్థలం

ఈ కొండే మాకు ఆధారం..

ఈ కొండేపైనే మేమంతా పశువులను మేపుకొని జీవనం సాగిస్తున్నాం. ఈ కొండను తొలగిస్తామంటే మేం ఎలా బతికేది?. కనీసం మా అభిప్రాయం తీసుకోకుండా కొండను గ్రావెల్ తవ్వకాలకు లీజుకు ఇవ్వడం దారుణం. దీనిపై పోరాడి.. కొండను కాపాడుకుంటాం.

-కమల, సంచాం

పంటలు నాశనమవుతాయి..

కొండ చుట్టూ దళితులకు ప్రభుత్వం డీపట్టా భూములు అందించింది. వాటిలో జీడి, మామిడి సాగు చేస్తున్నాం. ఇప్పుడు గ్రావెల్ తవ్వకాలతో ఈ ప్రాంతం ఎర్రబారుతుంది. పంటలు నాశనమవుతాయి. కొండ నుంచి జాలువారే వర్షపు నీరు సాగుకు ఉపయోగపడుతోంది. అటువంటి కొండను తొలగిస్తే ఉద్యమిస్తాం.

-మీసాల కళావతి, సంచాం

కలెక్టర్ స్పందించాలి..

పశువులతో పాటు గొర్రెలు, మేకల మేతకు ఈ కొండ ఎంతో అనువైన ప్రాంతం. చిన్నపాటి వర్షం పడినా కొండ నుంచి జారిపడే నీరు సాగుకు ఉపయోగపడుతోంది. జంతువుల దాహార్తిని తీర్చుతుంది. అటువంటి కొండను లీజు పేరుతో ప్రైవేటు వ్యక్తులకు రాసి ఇవ్వడం దారుణ చర్య. దీనిపై కలెక్టర్ స్పందించి చర్యలు చేపట్టాలి.

-గొర్లె హరి, సంచాం

ఓబీసీ ప్రక్రియ వేగవంతం చేయాలి

(ఐదో పేజీ తరువాయి)

వీరేంద్రకుమార్‌ను ఢిల్లీలో మంగళవారం కలిశారు. తూర్పుకాపు, కళింగవైశ్య, శిష్టకరణ, సొండి అరవ కులాలను కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చాల్సిన ఆవశ్యకతను వివరించారు. దీనిపై ఎన్సీబీసీ ఛైర్మన్ గంగారాం అహిర్ ఆధ్వర్యంలో ఐదు సామాజిక వర్గాలకు చెందిన ప్రతినిధులతో సామాజిక వేదిక నిర్వహించామని తెలిపారు. ఇదే అంశంపై తాను పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికైనప్పటి నుంచీ డిమాండ్ చేస్తున్నామని.. దీనిని ప్రాధాన్యతగా గుర్తించడంతో పాటు త్వరితగతిన రిజిస్ట్రేషన్ అమలయ్యేలా చూడాలని విన్నవించారు.

పూండి రైల్వేస్టేషన్, బెండి గేటు అంశంపై..

ఉద్దానంలోని పూండి రైల్వేస్టేషన్‌లో మౌలిక వసతులు కల్పించాలని కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. ఈ మేరకు ఢిల్లీలో కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విన్‌వైష్ణవ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. 'కరోనా ముందు పూండిలో భువనేశ్వర్-సికింద్రాబాద్ (విశాఖ ఎక్స్‌ప్రెస్), భువనేశ్వర్-బెంగలూరు (ప్రశాంతి ఎక్స్‌ప్రెస్), పూరీ-తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదల చేసేవారు. వజ్రపుకొత్తూరు, నందిగాం, సంతబొమ్మాళి మండలాలకు చెందిన ప్రజలు ఈ స్టేషన్‌పైనే ఆధారపడి ఉన్నారు. ప్రాధాన్యాన్ని గుర్తించి ఆయా రైళ్ల నిలుపుదలను పునఃప్రారంభించాలి. రైల్వే స్టేషన్‌లో తాగునీరు, ప్రయాణికుల విశ్రాంతి భవనాలు, మరుగుదొడ్లు, రిజర్వేషన్ కౌంటర్ ఏర్పాటు చేయాల' వారు కోరారు.అలాగే బెండి గేటుపై ఫ్లైఓవర్ పనులను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, వజ్రపుకొత్తూరు మండల ప్రధాన కార్యదర్శి కర్ని రమణ తదితరులు పాల్గొన్నారు.

కాశీబుగ్గ రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి పూర్తి చేయాలి..

పలాస, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ ఎల్‌సీ గేటు వద్ద నిలిచిపోయిన రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులను పూర్తి చేసేందుకు సహకరించాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. ఈ మేరకు మంగళవారం ఢిల్లీలో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడుతో కలిసి కేంద్ర రైల్వేమంత్రి అశ్విన్ వైష్ణవ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. '2008లో శంకుస్థాపన జరిగిన ఈ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. తూర్పు వైపు 80శాతం పూర్తయినా పడమర వైపు పనులు ఇంకా ప్రారంభం కాలేదు. రైల్వేస్టేషన్‌కు సమీపంలో ఉన్నందున ఇక్కడున్న పాత హైవేపై నిత్యం వేలాది వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. గేటు పడితే కనీసం 45 నిమిషాల పాటు వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు తీవ్ర అంత రాయం కలుగుతోంది. ప్రజలు ఇబ్బందుల దృష్ట్యా ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తిచేయాల'ని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని.. త్వరితగతిన పనులు కార్యరూపం దాలుస్తాయని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

139 దేవాలయాలకు సాయం

● దేవదాయశాఖ సహాయ కమిషనర్ ప్రసాద్ పట్నాయక్



టెక్కలి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ధూప, దీప, నైవేద్యాల కింద కొన్ని దేవాలయాలకు దేవదాయ శాఖ నెలకు రూ.పదివేల వంతున సాయం అందజేస్తుందని సహాయ కమిషనర్ ప్రసాద్ పట్నాయక్ తెలిపారు. ఆ విశేషాలు తెలుసుకుందాం.

ప్రశ్న: జిల్లాలో ఎన్ని ఆలయాలను ధూప, దీప, నైవేద్యాలకు గుర్తించారు?

జవాబు: జిల్లాలో ధూప, దీప, నైవేద్యాల కింద 139 దేవాలయాలను గుర్తించాం. గతంలో దీని కింద నెలకు రూ.ఐదువేల చొప్పున అర్చకులకు అందజేసేవారు. ఈ ఏడాది అక్టోబరు నుంచి నెలకు రూ.పదివేల చొప్పున అందజేస్తున్నాం.

ప్ర: దేవదాయ భూముల ఆక్రమణల నిరోధానికి మీరు తీసుకుంటున్న చర్యలేంటి?

జ: జిల్లాలో వివిధ దేవాలయాల కింద సుమారు తొమ్మిది వేల ఎకరాల భూములు ఉన్నాయి. సెక్షన్ 83 ప్రకారం ఆక్రమణదారులకు కొన్నిచోట్ల నోటీసులు ఇచ్చాం. జిల్లాలో వివిధ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు దేవదాయ భూముల వివరాలు తెలియజేశాం. ఆ ప్రాంతంలో ఎవరూ రిజిస్ట్రేషన్ చేయకుండా చర్యలు తీసుకుంటున్నాం. కొన్నిచోట్ల దేవదాయ భూముల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నాం.

ప్ర: జిల్లాలో దేవదాయ శాఖ పరిధిలో ఎన్ని దేవాలయాలు ఉన్నాయి?

జ: జిల్లాలో దేవదాయశాఖ పరిధిలో 6ఏ కింద ఆరు, 6బీ కింద 19, 6సీ కింద 732 దేవాలయాలు ఉన్నాయి. రూ.25 లక్షలకు పైగా ఆదాయం దాటిన దేవాలయాల్లో అరసవెల్లి దేవదాయ శాఖ కమిషనర్ పరిధిలో ఉంది. శ్రీకూర్మం, శ్రీముఖలింగం, రావివలస ఎండలమల్లికార్జున స్వామి, కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి, పాతపట్నం నీలమణి దుర్గమ్మ అమ్మవార్ల ఆలయాలు సంయుక్త కమిషనర్ పరిధిలో ఉన్నాయి. ఏడాదికి రూ.5లక్షల లోపు ఆదాయం గల 6సీ దేవాలయాలు అర్చకులు, మఠాధిపతులు, గ్రామ కమిటీల ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి.

ప్ర: సీజీఎఫ్ నిధులతో ఎక్కడెక్కడ దేవాలయాల పనులు జరుగుతున్నాయి?

జ: జిల్లాలో 12చోట్ల కామన్‌గుడ్స్ ఫండ్స్(సీజీఎఫ్) కింద వివిధ ఆలయాల పనులు జరుగుతున్నాయి. పెద్దపద్మాపురం, దూసి, పిడిమందసలో పనులు వేగవంతంగా పూర్తవుతున్నాయి. మరో 12చోట్ల టెండర్ల దశలో ఉన్నాయి.

ప్ర: ముఖ్య దేవాలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారా?

జ: దేవదాయ శాఖ పరిధిలో 6ఏ, 6బీ కేటగిరిలో ఉన్న అన్ని ప్రధాన దేవాలయాలకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. ఆ ఆలయాల ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ల పర్యవేక్షణలో సీసీ కెమెరా నిఘా ఉంటుంది.

ప్ర: జిల్లాలో దేవదాయ శాఖ సిబ్బంది కొరత ఉందా?

జ: జిల్లాలో 108 దేవాలయాలు కార్యనిర్వాహక అధికారుల పరిధిలో ఉన్నాయి. మిగిలినవి అర్చకులు, మఠాధిపతులు, గ్రామకమిటీల పర్యవేక్షణలో ఉన్నాయి. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో 22 ఈవో పోస్టులకు గాను 11 ఖాళీగా ఉన్నాయి.



ఉదయం వేళలో తెలుపు రంగులో...



సాయంత్రం వేళలో ఎరుపు వర్ణంలో...

రంగులు మార్చే మందారం

కంచిలి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మఖరాంపురం గ్రామానికి చెందిన బెందాళం భోగేష్ ఇంటి ఆవరణలో ఉన్న మందారం చెట్టుకు పూసిన పువ్వులు వివిధ రంగుల్లోకి మారుతూ చూపరులను ఆకట్టుకుంటున్నాయి. పువ్వు పూసే సమయంలో తెలుపు రంగులో... మధ్యాహ్న సమయంలో లేత ఎరుపు రంగు... సాయంత్రానికి ఎరుపు రంగులోకి మారుతున్నాయి. ఈ విషయమై ఉద్యాన శాఖాధికారిణి మాధవీలత వద్ద ప్రస్తావించగా గతంలో చైనాలో కనిపించే ఈ జాతి మొక్కలు ప్రస్తుతం అన్ని దేశాలలో దర్శనమిస్తున్నాయని తెలిపారు. హైబిస్కస్ మ్యూటాబిలిస్ సాంకేతిక నామం గల ఈ జాతి మందారాన్ని స్థానికంగా కాటన్ రోజ్, డిక్సీ రోజ్ పేరుతో పిలుస్తారన్నారు. వీటి రెక్కల్లో ఉండే యాంలో సైనిన్ అనే రసాయనం కారణంగా ఇలా రంగులు మారుతాయని తెలిపారు.



రాష్ట్రపతి ద్రౌపదిముర్ముతో మాట్లాడుతున్న ఎంపీ కలిశెట్టి

రాష్ట్రపతితో ఎంపీ కలిశెట్టి కుటుంబ సభ్యుల భేటీ

● మహిళా దినోత్సవ రోజు విజయనగరం రావాలని విజ్ఞప్తి

న్యూఢిల్లీ/పొందూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఆయన కుటుంబసభ్యులు భేటీ అయ్యారు. మంగళవారం, రాష్ట్రపతి భవన్‌లో ఎంపీ తన భార్య, కుమార్తెతో రాష్ట్రపతిని కలిశారు. ఈ సందర్భంగా వచ్చే ఏడాది మహిళా దినోత్సవం సందర్భంగా విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో మహిళలతో ఏర్పాటు చేయబోయే సమావేశానికి రావాలని రాష్ట్రపతిని ఎంపీ కలిశెట్టి కోరారు. పొందూరు చేనేత కార్మికులు నేసిన చీరను రాష్ట్రపతికి ఎంపీ భార్య బహూకరించారు.

ఆక్రమణలు తొలగించాలి

సోంపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మామిడిపల్లి గ్రామంలో సర్వే నెంబర్ 181లోని ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు తొలగించాలని సీపీఐ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ బి.అప్పలస్వామికి వినతిపత్రం అందించారు. ప్రభుత్వ భూమిని కొంతమంది ఆక్రమించుకున్నా రని, బీడీఆర్ పట్టాలను ఉపయోగించి ఎక్కువ ఆక్రమణలకు పాల్పడ్డారని వివరించారు. సర్వే నిర్వహించి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో మాజీ సర్పంచ్ పాతిన కృష్ణమూర్తి, సీపీఐ నాయకులు జె.సింహాచలం, పాపారావు, జేజమ్మ తదితరులు ఉన్నారు.

జాతీయస్థాయి పోటీలకు కవిటి విద్యార్థులు

కవిటి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయస్థాయి కళాఉత్సవ్-2024కు ఎంపికైనట్లు హెచ్‌ఎం బి.మల్లేశ్వరరావు తెలిపారు. ఇటీవల గార మండలం వమరవల్లి డైట్‌లో జిల్లా స్థాయిలో నిర్వహించిన కళా ఉత్సవ్ పోటీల్లో కవిటి విద్యార్థులు ఆరు విభా గాల్లో మొదటి స్థానాన్ని సంపాదించారు. మంగళవారం విజయవాడలో జరి గిన రాష్ట్ర స్థాయి పోటీల్లో జానపద నృత్యం, గీతం విభాగాల్లో ప్రథమస్థానం పొందారు. దీంతో జాతీయస్థాయి కళా ఉత్సవ్‌కు ఎంపికైనట్లు హెచ్‌ఎం తెలిపారు.

అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలి

జి.సిగడాం,డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నాగులవలస పంచాయతీ వీఆర్‌పేట శంభువాని చెరువు గర్భంలో అక్రమంగా నిర్మించిన చర్చిని తొలగించాలని రాష్ట్ర సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి అన్నారు. మంగళవారం ఈ చర్చిని పరిశీలించారు. అక్రమ నిర్మాణంపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే నిరసనలు చేపట్టేందుకు వెనుకాడబోమని హెచ్చరించారు. అక్రమ నిర్మాణాలకు గ్రామస్థులు కూడా సహకరించకూడదన్నారు. ప్రభుత్వ భూములు, చెరువులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. ఆయన వెంట మీసాల రామకృష్ణ తదితరులు ఉన్నారు.

ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

జి.సిగడాం, డిసెంబరు (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని తహసీల్దార్ ఎం.శ్రీకాంత్ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికల సిబ్బంది శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. ఈ నెల 14న సాగునీటి సంఘాలు, మైనర్ ఇరిగేషన్ సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయని చెప్పారు. ఎన్నికలు సజావుగా జరిగేటట్లు చూడాలన్నారు. అవకాశం ఉన్నంత వరకు ఏకగ్రీవం అయ్యేలా చూడాలని, ఏకగ్రీవ సంఘాలకు ప్రభుత్వం ద్వారా అందనున్న ప్రోత్సాహకాలను వివరించాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక వసతులు కల్పించాలని అన్నారు. ఎంపీడీవో జి.రామకృష్ణ, ఇరిగేషన్ ఏఈ రాజశేఖర్ పాల్గొన్నారు.

బాధ్యతగా విధులు..

లావేరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ నెల 14న జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికల్లో సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహించాలి తహసీల్దార్ వై.జోగారావు అన్నారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఎన్నికల సిబ్బందికి శిక్షణ తరగతులను నిర్వహించారు. మండలంలో 13 సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయని, 5405 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఇరిగేష్ ఏఈ గోవిందరావు, డీటీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

15న కబడ్డీ జట్ల ఎంపిక

శ్రీకాకుళం స్పోర్ట్స్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం కోడిరామ్మూర్తి స్టేడియంలో ఈ నెల 15న ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా కబడ్డీ జూనియర్ బాలురు, బాలికల జట్లను ఎంపిక చేయనున్నట్లు ఆ సంఘం జిల్లా చైర్మన్, ఎమ్మెల్యే గొండు శంకర్, అధ్యక్షుడు నక్క కృష్ణారావు, కార్యదర్శి సాధు ముసలినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారుల వయసు 20 ఏళ్లలోపు ఉండాలని, బాలురు 70 కేజీలు, బాలికలు 65 కేజీల లోపు బరువు ఉండాలని చెపాపరు. ఎంపికైన వారు ఈ నెల 22 నుంచి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆర్గనైజింగ్ కార్యదర్శి సాధు శ్రీనివాసరావు తెలిపారు.

'స్వయమ్ ప్లస్'పై సమీక్ష

ఎచ్చెర్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రిత్వ శాఖ ప్రారంభించిన స్వయమ్ (స్టడీ వెబ్స్ ఆఫ్ యాక్టివ్ లెర్నింగ్ ఫర్ యంగ్ ఎస్పైరింగ్ మైండ్స్) ప్లస్ కోర్సుల్లో విద్యార్థుల నమోదు, పర్యవేక్షణ తదితర అంశాలపై మద్రాసు ఐఐటీకి చెందిన ప్రొఫెసర్ ఆర్‌.సారథి మంగళవారం సమీక్షించారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి వర్చువల్ విధానంలో నిర్వహించిన ఈ సమీక్షలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని పాల్గొన్నారు. స్వయమ్ ప్లస్‌లో మూడు, ఆరు నెలల వ్యవధి గల ఉపాధి సహిత స్వల్ప కాలిక కోర్సులు నిర్వహిస్తారు. బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఆమోదంతో ఆయా కోర్సుల్లో ఈ తరహా అంశాలు జోడించడానికి వర్సిటీలు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారని వీసీ చెప్పారు. ఎంఎస్సీ ఫిజిక్స్ ఇంజనీరింగ్ ఈసీఈ, మెకానికల్ విద్యార్థులకు 14 రోజుల ఉపాధి కల్పన కోర్సును మద్రాసు ఐఐటీ అందిస్తున్నట్టు చెప్పారు. ఈ కోర్సు ఫీజు, వసతి తదితర మిళితంగా సుమారు రూ.25 వేలు విద్యార్థులు చెల్లించాలని ప్రొఫెసర్ సారథి తెలిపారని అన్నారు. ఉన్నత విద్యామండలి ఇన్‌చార్జి చైర్మన్ ప్రొఫెసర్ కె.రామ్మోహనరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బీఆర్‌ఏయూ నుంచి స్వయమ్ ప్రతినిధులు డాక్టర్ జి.రామకృష్ణ, ఎ.గణేష్‌బాబు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం

ఇచ్ఛాపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పంజావీధి స్కూల్‌లో మంగళవారం ముందస్తు జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పంజావీధి, ఎం.తోటూరు ఎంపీయూపీ స్కూల్ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండలం, మున్సిపాల్టీ పరిధిలోని 50 పాఠశాలల విద్యార్థులు పాల్గొని పలు రకాల గణిత రంగవల్లులు, ప్రాజెక్టులతో అలరించారు. ఈ సందర్భంగా ఎంఈవో కె.అప్పారావు మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లో గణితం అంటే భయం పోయి ఆసక్తి కలుగుతుందని అన్నారు. ఎంఈవోను హెచ్‌ఎంలు సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్.విశ్వనాథం, నరేంద్రనాథ్ పట్నాయిక్, డి.ధనలక్ష్మి, ఎం.మల్లేశ్వరరావు, మ్యాథ్స్ అసిస్టెంట్ కె.తేజేశ్వరకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై దృష్టిసారించాలి

గుజరాతీపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వసతి గృహాల్లో పరిసరాల, పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పౌష్టికాహారంపై ప్రత్యేక దృష్టి సారించాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్‌.సన్యాసినాయుడు అన్నారు. రణస్థలం ప్రభుత్వ కళాశాలలోని బీసీ హాస్టల్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. మౌలిక సదుపాయాల గురించి ఆరా తీసి, సిబ్బందికి తగు సూచనలు చేశారు.

కొబ్బరి ఉత్పత్తిదారుల నూతన కార్యవర్గం

కవిటి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సెర్ప్ వెలుగు ఆధ్వర్యంలో నడుస్తున్న కొబ్బరి ఉత్పత్తిదారుల సంస్థ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. కవిటిలోని మహిళా సమాఖ్య భవనంలో రైతుసంఘాల ప్రతినిధులు సమావేశమై కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆరంగి అనిల్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా గొండ్యాల రవి, కోశాధికారిగా బి.శ్రీనివాసరావు, కార్యదర్శిగా దట్టి దాలయ్య, సహకార్యదర్శిగా ఆర్‌.నారాయణరావుతో పాటు 10మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

శ్వేత పుష్కరిణికి మహర్దశ

● రూ.20 కోట్లతో అభివృద్ధికి శ్రీకారం ● కేంద్రమంత్రి రామ్మోహన్ కృషి ● సిద్ధమవుతున్న డీపీఆర్

గార, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): శ్రీకూర్మం క్షేత్రంలోని శ్వేత పుష్కరిణికి మహర్దశ పట్టింది. శతాబ్దాల కాలం నాటి ఈ పుష్కరిణిని రూ.20 కోట్లతో అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందుకు అవసరమైన డీపీఆర్ సిద్ధమవుతోంది. విశాఖపట్నంకు చెందిన శిల్పాకృతి అనే ఆర్కిటెక్చర్ సంస్థ శ్వేత పుష్కరిణి అభివృద్ధికి అవసరమైన డిజైన్ రూపకల్పన చేస్తోంది. ఇటీవల ఆ సంస్థకు చెందిన ఇంజినీర్లు శ్రీకూర్మం క్షేత్రాన్ని సందర్శించారు. పుష్కరిణిని క్షుణ్ణంగా పరిశీలించి ఎక్కడెక్కడ ఏవేవి ఉండాలి.. ఎలా ఉండాలి అనే దానిపై ఆలయ అధికారులతో కలిసి కొలతలు తీసుకున్నారు. శ్రీకాకుళంలో ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ.. శ్వేత పుష్కరిణిని రూ.20కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించారు. నిధుల మంజూరుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. పుష్కరిణి అభివృద్ధి జరగనుండడంతో భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నాలుగు స్నానపు ఘాట్లు..

శ్రీకూర్మం ఆలయం వెనుక దశావతారాల పా ర్కులో ఉన్న నల్లరాతి దశావతారాల విగ్రహాలను శ్వేత పుష్కరిణి వద్దకు తరలించనున్నారు. ఇక్కడ కొత్తగా దశావతారాల పార్కు ఏర్పాటు చేయనున్నా రు. నాలుగు స్నానపు ఘాట్లు, చుట్టూ విశాలమైన ఫుట్‌పాత్, విద్యుత్ కాంతులు, వీఐపీ వాహనాల పార్కింగ్, భక్తులు దుస్తులు మార్చుకొనే గదులు, అందమైన పూలమొక్కల పెంపకంతో అత్యాధునికంగా శ్వేత పుష్కరిణిని అభివృద్ధి చేసేందుకు రూపకల్పన చేస్తున్నారు. కొద్ది రోజుల్లో డీపీఆర్ సిద్ధం చేసి జిల్లా కలెక్టర్ వద్దకు తీసుకు వెళ్లనున్నట్లు సమాచారం. అక్కడ కలెక్టర్ డీపీఆర్‌ను చూసి ప్రభుత్వ అనుమతి కోసం పంపనున్నట్లు తెలిసింది. ప్రభుత్వ ఆమోదం పొంది నిధులు విడుదలైన వెంటనే పుష్కరిణి అభివృద్ధి పనులు ప్రారంభంకానున్నాయి



శ్రీకూర్మంలోని శ్వేత పుష్కరిణి

మా అదృష్టం



మహావిష్ణువు దశ అవతారాల్లో ఒకటైన శ్రీకూర్మం క్షేత్రం మా ప్రాంతంలో ఉండడం మా అదృష్టం. ఆలయంలోని శ్వేత పుష్కరిణి అభివృద్ధికి కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు కృషి చేయడం, నిధులు మంజూరు చేయడంపై శ్రీకూర్మం ప్రజల తరఫున ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతున్నాం. ఈ క్షేత్రం మరింతగా అభివృద్ధి చెంది మంచి పర్యాటక కేంద్రంగా మారుతుంది.

- కైబాడి రాజు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి (శ్రీకూర్మం)

పంచాయతీలను సుందరంగా తీర్చిదిద్దుతాం

● ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్

ఇచ్ఛాపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి పంచాయతీని అత్యంత సుంద రంగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. శానిటేషన్ నిమిత్తం మండపల్లి పంచాయతీకి ట్రాక్టర్ మంజూరైంది. ఈ ట్రాక్టర్‌ను మంగళవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే అశోక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పల్లెపండగ కార్యక్రమం ద్వారా అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు, కాలువలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. పారిశుధ్యం మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వం చేసిన పొరపాట్లు చేయకుండా, పంచాయతీ వ్యవస్థ నిర్వీర్యం కాకుండా గాడినపెట్టే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామారావు, తహసీల్దార్ ఎన్‌.వెంకటరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు, ఎంపీపీ బోర పుష్ప, మాజీ ఎంపీపీ దక్కత ఢిల్లీరావు, కూటమి నేతలు రెయ్యి జానకిరావు, తిప్పన దుర్యోధనరెడ్డి, నందికి జాని, సహదేవ్‌రెడ్డి, బి.లోహిదాస్, నాగరాజు, ఎస్‌.శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



ట్రాక్టర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అశోక్

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

● శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం, డిసెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొన్నారు. శ్రీకాకుళం రూరల్ మండలం కృష్ణప్పపేటలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. భూఆక్రమణలు, ఫ్రీహోల్డ్, మ్యుటేషన్, 22ఏ, డీకేట్, రీసర్వే ఇతర రెవెన్యూ సమస్యలపై వినతులు స్వీకరించి 15 రోజుల్లో పరిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు. ●శ్రీకాకుళం నియోజకవర్గాన్ని జిల్లాలోనే నెంబర్ 1గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. గార, రూరల్ మండలాల ఎంపీడీవోలు, ఈవోఆర్డీలు, విద్యాశాఖ అధికారులతో జడ్పీలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా జిల్లా కేంద్రం శ్రీకాకుళం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా పరిస్థితి నెలకొందని అన్నారు. జడ్పీ నిధులతో అభివృద్ధి పనులు ప్రారంభించాలని సూచించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

సోంపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కొర్లాంలో భూలోక మాత ఆలయ పునర్నిర్మాణానికి గ్రామస్థులు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో కొత్తది నిర్మించేందుకు గ్రామస్థులు పూనుకున్నారు. వేదపండితుడు పూర్ణచంద్ర పాణిగ్రాహీ భూమి పూజ నిర్వహించారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కృష్ణమూర్తి

మానవ హక్కులు కాపాడాలి

ఇచ్ఛాపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మానవ హక్కులను కాపాడేందుకు కృషి చేస్తున్నట్లు హ్యూమన్ రైట్స్ నేషనల్ ఫెడరేషన్ కౌన్సిల్ నియోజకవర్గ అధ్యక్షుడు దక్కత కృష్ణమూర్తిరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించిన మానవ హక్కుల దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మానవ హక్కుల ఉల్లంఘనకు సంబంధించిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేందుకు కోర్టులతో పాటు మానవ హక్కుల కమిషన్ ఏర్పడినట్లు తెలిపారు. మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా స్వర్ణభారతి, ఆదిత్య డిగ్రీ కళాశాలలతో పాటు ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాల విద్యార్థులకు వివిధ అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రోబిన్ కుమార్‌పాడి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జె.సదయ్య, హ్యూమన్ రైట్స్ నియోజకవర్గ కార్యదర్శి ఎం.రాంబాబు, ఆర్గనైజేషన్ సెక్రటరీ రామారావు, అసిస్టెంట్ ఎడ్యుకేషన్ సెక్రటరీ కేసీ పూరి, తులసిరావు పాల్గొన్నారు.

2,810 క్వింటాల బియ్యం పట్టివేత

కంచిలి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మఖరాంపురం జంక్షన్ ఆదివారం సంత వద్ద విజిలెన్స్ అధికారులు 2,810 క్వింటాల పీడీఎస్ బియ్యం పట్టుకున్నారు. మంగళవారం ఈ జంక్షన్ వద్ద తనిఖీలు చేపడుతుండగా అక్రమంగా వ్యాన్‌లో ఒడిశాకు తరలిస్తున్న బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ సీఐ రామారావు తెలిపారు. వ్యాన్‌ని సీజ్ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ కూర్మారావు, ఆర్‌ఐ కృష్ణప్రసాద్‌రౌలో పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 18 మంది ఎంపిక

ఎచ్చెర్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో మంగళవారం ఏపీఎస్‌ఎస్‌డీసీ, జిల్లా ఉపాధి కల్పన శాఖ సంయుక్తంగా జాబ్‌మేళా నిర్వహించాయి. మూ డు కంపెనీల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరగగా 18 మందిని ఎంపికచేశారు. జిల్లా ఉపాధి కల్పనాధికారి కె.సుధ, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్, సెట్‌శ్రీ సీఈవో ప్రసాద రావు, టూరిజం అధికారి నారాయణరావు, శిక్షణాధికారి బి.కామేశ్వరరావు, ఏపీఎస్‌ఎస్‌డీసీ ప్లేస్‌మెంటు ఆఫీసర్ ఎం.వంశీ పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నేత మృతి



నరసింగరావు (ఫైల్)

రణస్థలం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన టీడీపీ సీనియర్ నేత శనాపతి నరసింగరావు (78) మంగళవారం సాయంత్రం మృతి చెందారు. గత కొన్ని రోజులుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నరసింగరావుకు భార్య, పిల్లలు ఉన్నారు. ఆయన మృతి టీడీపీకి తీరని లోటని, మాజీ ఎంపీపీ డీజీఎం ఆనందరావు అన్నారు. ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, కూటమి నేతలు గొర్లె లక్ష్మణరావు, దెయ్యం వసంతరావు, డీజీఎం శ్రీనివాస్, పిన్నింటి భాను, పిషిని జగన్నాథంనాయుడు, పైడి అప్పడదొర ప్రగాఢ సానుభూతి తెలిపారు.

16న బహిరంగ సభ

రణస్థలం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఎస్టీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 16న రణస్థలంలో బహిరంగ సభ జరగనుంది. ఈ సభను విజయవంతం చేయాలని దళిత నాయకుడు దువ్వాన అప్పలసూరి కోరారు.

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

● మృతికి భర్త మధు కారణమంటున్న కుటుంబ సభ్యులు


స్వాతి (ఫైల్)

నరసన్నపేట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీదేవి నగర్‌లో నివాసం ఉంటున్న అంధవరపు మధు భార్య స్వాతి (40) మంగళవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. గత కొన్నాళ్లుగా శ్రీదేవి నగర్‌లో ఉపాధ్యాయుడు అంధవరపు మధు భార్య స్వాతి, కుమార్తె ప్రణీవితో కలిసి ఉంటున్నారు. మంగళవారం మధు తన తల్లి చనిపోయిన ఏడాది కార్యక్రమానికి శ్రీకాకుళంలోని స్వగృహానికి వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చే సరికి భార్య స్వాతి ఉరివేసుకుని మృతి చెంది ఉంది. అయితే స్వాతి మృతికి మధుయే కారణమని ఆమె తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఆ సమయంలో కుమార్తె చదువుకునేందుకు పాఠశాలకు వెళ్లింది. స్వాతి మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇంటి తలుపులు తీసి ఉండడం, మధ్యాహ్నం 3 గంటల వరకు చుట్టుపక్కల వారితో మాట్లాడడం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ దుర్గాప్రసాద్ ఘటన ప్రాంతానికి చేరుకుని పరిశీలించారు. అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మృతురాలి భర్త మధు నిమ్మాడ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.

మనస్తాపానికి గురై యువకుడి ఆత్మహత్య

మందస, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సభ్యులు మందలించారని మనస్తాపానికి గురై యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మందసలో చోటుచేసుకొంది. మందస ఏఎస్‌ఐ కె.శేఖరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. కుమ్మరవీధికి చెందిన బెహర రామకృష్ణ(33) ఇంటి సమీపంలో ఇటుక బట్టీని నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. మద్యం సేవించి తరచూ ఇంటికి వస్తుండడంతో కుటుంబసభ్యులు మందలిస్తుండేవారు. అదేవిధంగా సోమవారం రాత్రి కుటుంబ సభ్యులు ఆయనను ప్రశ్నించడంతో ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. ఎప్పటికీ ఇంటికి రాకపోవడంతో తండ్రి బెహరా శ్యాం, కుటుంబసభ్యులు గాలించారు. అయితే గ్రామ సమీపంలోని పురిపాకలో ఇటుక బట్టీలో ఉన్న లుంగీతో ఉరివేసుకుని మృతి చెంది ఉన్నాడు. దీనిని గుర్తించి తండ్రి బెహర శ్యాం మంగళవారం మందస పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడికి భార్య, ఆరు నెలల కుమార్తె ఉన్నారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి హరిపురం సీహెచ్‌సీకి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ శేఖరరావు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కోటబొమ్మాళి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పోలాకి మండలం పిరియా గ్రహారానికి చెందిన కొండ దుర్గాప్రసాద్ (24) పురుగుల మందు తాగి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. దుర్గాప్రసాద్ సోమవారం రాత్రి హరిశ్చంద్రపురం రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో ఉండడంతో గమనించిన స్థానికులు వెంటనే 108 వాహనంలో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మధ్యాహ్నం మృతి చెందాడని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ శంకరరావు తెలిపారు.

20 లీటర్ల సారాతో వ్యక్తి అరెస్టు

నందిగాం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): హర్షబాడ పంచాయతీ సాగరంపేటలో మంగళవారం సవర వెంకట్రావు వద్ద 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని అతనిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ షేక్‌మహ్మద్ ఆలీ తెలిపారు. సమాచారం మేరకు సిబ్బందితో దాడి నిర్వహించగా అతని వద్ద సారా ఉన్నట్లు గుర్తించి అరెస్ట్ చేసి టెక్కలి కోర్టులో హాజరుపరిచామన్నారు. కోర్టు 14 రోజుల రిమాండ్ విధించడంతో నరసన్నపేట జైలుకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

పాతపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బెల్ట్‌షాపుల నిర్వహణకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్‌ఐ బి.లావణ్య తెలిపారు. కాగువాడ గ్రామస్థుడు 7 మద్యం బాటిళ్లను అక్రమంగా తరలిస్తూ మంగళవారం పట్టుబడినట్లు తెలిపారు. మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. ఒక వ్యక్తిపై ఒకకేసుకు మించి ఉంటే బెయిల్ కూడా రాదన్నారు.

గంజాయి రవాణా అరికట్టేందుకు..

హిరమండలం/కొత్తూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలు, గంజాయి రవాణా అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని కొత్తూరు సీఐ ప్రసాదరావు అన్నారు. మంగళవారం వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేశారు. హిరమండలం, కొత్తూరు మండలాల్లో ఒడిశా నుంచి ఆంధ్ర వచ్చే వాహనాలు, బస్సులతో పాటు పలు దుకాణాలను జాగిలాలతో తనిఖీ చేశారు. కార్యక్రమంలో హిరమండలం ఎస్‌ఐ ఎండీ యాసిన్ తదితరులున్నారు.

యువతి అదృశ్యం

ఇచ్ఛాపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధి రత్తకన్న తోట వీధికి చెందిన దుర్గాసి మాధవి(20) అనే యువతి అదృశ్యమైనట్లు ఆమె అక్క గిడగ మమత పట్టణ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేసింది. మాధవికి మతి స్థిమితం లేదు. ఈ నెల 3న ఉదయం 8గంటల సమయంలో సైకిల్‌కు గాలి కొట్టించుకొని వస్తానని బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చిన్నంనాయుడు తెలిపారు.

రత్తకన్న కాలనీకి చెందిన వివాహిత..

ఇచ్ఛాపురం పట్టణంలోని రత్తకన్న కాలనీకి చెందిన కాతిల రీటారెడ్డి(28)అనే వివాహిత ఈ నెల 9న అదృశ్యమైంది. ఈమె భర్త దుబాయిలో వలస కూలీగా పని చేస్తున్నాడు. దీంతో తల్లి వద్దనే ఉంటుంది. సోమవారం ఉదయం నిద్ర లేచే సరికి ఆమె కనిపించకపోవడంతో తల్లి పట్టణ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ చిన్నంనాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మాదక ద్రవ్యాలకు బానిసలు కావొద్దు

టెక్కలి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు బానిసలు కావొద్దని, దీనివల్ల ఆరోగ్యం క్షీణిస్తుందని ఎస్‌ఐ కె.రాము అన్నారు. మంగళవారం స్థానిక ఓ ప్రైవేటు కళాశాలలో ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కుటుంబాలు విచ్ఛిన్నమవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆనందరావు మాట్లాడుతూ.. విద్యార్థి దశలో మాదక ద్రవ్యాలకు బానిసైతే జీవితం నాశనమైపోతుందన్నారు. వీటికి దూరంగా ఉండి ప్రణాళికాబద్ధంగా చదువుకుని తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ ప్రతినిధి కొన్ని మురళి, కళాశాల డైరెక్టర్ ఎండ ముకుందరావు, తమ్మినాన ఆనందరావు, సిగిలపల్లి మదన్‌కుమార్ పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన ఉండాలి

పోలాకి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మహిళలకు సంబంధించిన చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ రంజిత్ అన్నారు. మంగళవారం పోలాకి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సంకలంలో భాగంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలకు ప్రభుత్వం రూపొందించిన చట్టాలు, వాటిని వినియోగించే విధానాలను వివరించారు. సెల్‌ఫోన్లతో, ప్రేమపేరుతో విద్యార్థి దశను, పట్టుదలకు పోయి జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఏపీఎం తీరుకు వ్యతిరేకంగా ధర్నా

పాతపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వెలుగు ఏపీఎం డి.విజయకుమారి వ్యవహరిస్తున్న తీరుపై మంగళవారం గ్రామైక్య సంఘాల ప్రతినిధులు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా ఆర్ఎల్ పురం వీవోఏ డోల భాగ్యవతి మాట్లాడుతూ.. సుమారు 20 ఏళ్లుగా వీవోఏగా విధులను సమర్థ వంతంగా నిర్వహిస్తూ అధికారుల మన్ననలను పొందానని, అయితే తనను తొలగించాలనే ఏకైన లక్ష్యంతో విధులకు ఆటంకం కలిగించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఏవిధమైన నేరారోపణలు లేకుండా వీవోఏను తొలగించే ప్రయత్నాలను అడ్డుకొంటామని పలు సంఘాల ప్రతినిధులు స్పష్టం చేశారు. ఎస్‌హెచ్‌జీ సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, నాయకులు ఆమెకు మద్దతు పలుకుతూ ధర్నాలో పాల్గొన్నారు.

నిర్లక్ష్యం

ముంగెన్నపాటు గ్రామానికి వెళ్లే రోడ్డు పాడై రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. రాళ్లు పైకి తేలిపోవడంతో కనీసం నడిచి వెళ్లేందుకు ఇక్కట్లకు గురవుతున్నామని వాపోతున్నారు. అలికాం-బత్తిలి ప్రధాన రోడ్డుకు ఆనుకుని ముంగెన్నపాడు జంక్షన్ నుంచి ఒకటిన్నర కిలోమీటర్లలో దూరంలో ఉన్న ఈ గ్రామానికి సరైన రోడ్డు లేదని, వాహనదారులు గాయాల బారిన పడుతున్నారని చెబుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు.

-ఎల్ఎన్‌పేట, ఆంధ్రజ్యోతి


రాళ్లు తేలిన ముంగెన్నపాడు రోడ్డు

దుర్గంధం

మండలంలోని కైజోల, కొత్తూరు గ్రామాల రోడ్లకు ఇరువైపులా చెత్త కుప్పలు పేరుకుపోవడంతో దుర్గంధం వెదజల్లుతోందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. గ్రామంలో సేకరించిన చెత్తను ఊరి బయట పడేస్తున్నారని, దీంతో వర్షాలకు మరింత దారుణంగా తయారై దుర్వాసనతో ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి చెత్తను తొలగించి బ్లీచింగ్‌చేపట్టాలని స్థానికులు, వాహనచోదకులు కోరుతున్నారు.

- పలాస రూరల్, ఆంధ్రజ్యోతి


కైజోల గ్రామం వద్ద రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్త

అసంపూర్తి


అసంపూర్తి నిర్మాణంతో ఉన్న భవనాలు

పెద్దమడి గురుకుల పాఠశాల భవనం ఇది. టీడీపీ హయాంలో రూ.80 లక్షలతో ఏడేళ్ల కిందట నిర్మాణం ప్రారంభించారు. అయితే ఆ తరువాత వైసీపీ ప్రభుత్వంలో భవనాలకు ప్లాస్టరింగ్ చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో నేటికీ అలాగే దర్శనమిస్తోంది. మంజూరైన నిధుల భవనాలకే సరిపోయాయని, అదనంగా నిధులు కావాలని కోరినా అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ భవనాల్లోనే చదువుకోవాల్సి రావడంతో ఇబ్బందులు కలుగుతున్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పూర్తిస్థాయిలో భవనాలను వినియోగంలోకి తీసుకురావాలని వారు కోరుతున్నారు.

- మెళియాపుట్టి-ఆంధ్రజ్యోతి

విద్యుత్ అక్రమ వాడకంతో రూ.2 లక్షలు ఫైన్

సంతబొమ్మాళి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రొయ్యిల చెరువులకు విద్యుత్‌ను అక్రమంగా వినియోగించిన వైసీపీ నేత, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కెల్లి జగన్నాయకులుకు రూ.2 లక్షలు అపరాధ రుసుం విధించినట్లు ట్రాన్స్‌కో ఏఈ శివకుమార్ తెలిపారు. జగన్నాయకులు తన రొయ్యిల చెరువులకు అక్రమంగా విద్యుత్ వాడుతుండగా విజిలెన్స్ అధికారులు గత నెల 30న దాడి చేశారన్నారు. దీనికి సంబంధించి రూ.2 లక్షలు అపరాధ రుసుం విధించి మంగళవారం ఉత్తర్వులు వచ్చాయని ఆయన పేర్కొన్నారు.

ఆధార్ సేవలు ప్రారంభం

సంతబొమ్మాళి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తీరప్రాంత పంచాయతీ మలగాంలో ఆధార్ సెంటర్‌ను మంగళవారం ప్రారంభించారు. గతంలో ఆధార్ సేవల కోసం తీరప్రాంత ప్రజలు దూరప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం ఈ కేంద్రం ఏర్పాటుతో ఆధార్‌కష్టాలు తీరనున్నాయి. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బుచ్చ మురళీకృష్ణ, నిర్వాహకులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

కాశీబుగ్గ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అసౌకర్యం కలగకుండా నాణ్యమైన ఆహారాన్ని అందించాలని మునిసిపల్ కమిషనర్ ఎన్.రామారావు అన్నారు. మంగళవారం కాశీబుగ్గలోని అన్న క్యాంటీన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. క్యాంటీన్ నిర్వహణ, పారిశుధ్యం, టోకెన్లను పరిశీలించారు. భోజనం కోసం వచ్చే పేదలకు ఇబ్బంది లేకుండా చూసుకోవాలని, సేవాభావంతో లక్ష్యాన్ని నెరవేర్చాలని సూచించారు.

నైతిక విలువలతో కూడిన విద్యను అందించాలి

ఎల్.ఎన్.పేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యను అందించాలని ఎంఈవో-2 కె.చంద్రమౌళి అన్నారు. లక్ష్మీనర్సుపేట గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులతోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టికలను పరిశీలించారు. అనంతరం వివిధ పాఠ్యాంశాలపై విద్యార్థులకు ప్రశ్నలు వేసి సమాధానాలను రాబట్టారు. హెచ్ఎం మన్మథ కుమార్‌మిశ్రో పాల్గొన్నారు.

వైసీపీ నాయకుల ధాన్యమే కొంటారా?

మెళియాపుట్టి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పెద్ద లక్ష్మీపురం పంచాయతీలో వైసీపీ నాయకులకు చెందిన ధాన్యాన్ని అధికారులు కొనుగోలు చేస్తున్నారని టీడీపీ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు బూర్లె లలిత ఆరోపించారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. కొందరు వ్యవసాయాధికారులు నేటికీ వైసీపీ నేతల చెప్పుచేతల్లో ఉంటూ పని చేస్తున్నారన్నారు. సోమవారం ఉదయమంతా నెట్‌వర్క్ లేదని, సాయంత్రం మా ధాన్యానికి సంబంధించి ట్రక్కుషీట్ ఇవ్వడంతో రాత్రి మిల్లుల వద్ద ధాన్యం అన్‌లోడ్ కాక జాగారం చేయాల్సి వచ్చిందన్నారు. వైసీపీ నాయకులకు మాత్రం ముందుగానే ట్రక్కు షీట్లు ఇస్తున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళతామని చెబుతున్నా మండల అధికారుల్లో మార్పు లేదని ఆవేదన వ్యక్తంచేశారు. తుఫాన్ కారణంగా రైతులు ఆందోళన చెందుతుంటే అధికారులు మాత్రం సిబ్బందికి ట్రక్కుషీట్లు కొట్టవద్దని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ విషయమై మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గోవిందరావు దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు ఆమె తెలిపారు.

కౌశల్ పరీక్షలో ప్రతిభ

హరిపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మంగా నిర్వహించిన కౌశల్ ప్రతిభా పరీక్షలో సొండిపూడి హైస్కూల్ విద్యార్థినులు అద్భుత ప్రతిభ కనబరిచారు. జిల్లా స్థాయి పరీక్షల్లో రీల్స్ విభాగంలో డొక్కరి మాధవి విజేతగా నిలిచింది. అలాగే భాగ్యలక్ష్మి పాణిగ్రాహి ద్వితీయ స్థానం సాధించినట్లు హెచ్ఎం సుందర్ సాల్మన్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం పాఠశాలలో విద్యార్థినులను అభినందించారు. ఉపాధ్యాయులు కరుణాకర్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు

పాతపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గాజులు ధరించడం వల్ల సుఖప్రసవం జరిగే అవకాశం ఉంటుందని బైదలాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డా.సదాశివ అన్నారు. పీహెచ్‌సీలో రామరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం ఎస్సీ, ఎస్టీ మహిళలకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ట్రస్ట్ అధ్యక్షుడు పి.రామరాజు, సీహెచ్‌వో ఎం.పార్వతి, రాజులమ్మ పాల్గొన్నారు.

పంటల బీమా నమోదు బాధ్యత బ్యాంకర్లదే..

● లీడ్ బ్యాంకు మేనేజర్ సూర్యకిరణ్



మాట్లాడుతున్న లీడ్ బ్యాంక్ మేనేజర్ సూర్యకిరణ్

నరసన్నపేట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పంటల బీమా విధానం మారిందని దీనిపై రైతులకు అవగాహన కల్పించి బీమా కట్టించే బాధ్యత బ్యాంకులదేనని లీడ్ బ్యాంక్ మేనేజర్ సూర్యకిరణ్ అన్నారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. వ్యవసాయ రుణాలు తీసుకున్న రైతులతో పంటల బీమా చేయించే బాధ్యత బ్యాంకర్ల పై ఉందన్నారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో 9,500 మంది కౌలు రైతులకు రుణాలు అందించాలని సూచించారు. పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో నాబార్డు ఏజీఎం రమేష్ కృష్ణ, వ్యవసాయాధికారులు సునీత, చిరంజీవి, సురేష్, వెంకట్రావు, ఏపీవో అప్పలరామయ్య తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌పై అవగాహన కలిగించాలి


మాట్లాడుతున్న న్యాయాధికారి హరిప్రియ


మాట్లాడుతున్న న్యాయాధికారి రాణి

నరసన్నపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కోర్టులో ఈ నెల 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని న్యాయాధికారి సీహెచ్ హరిప్రియ అన్నారు. మంగళవారంస్థానిక కోర్టు ప్రాంగణంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. లోక్‌అదాలత్‌పై కక్షిదారులకు న్యాయవాదులు, పోలీసులు అవగాహన కల్పించాలన్నారు. మానవహక్కుల దినోత్సవం సందర్భంగా వాటి ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఏజీపీ సత్యనారాయణ, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంపై అవగాహన

టెక్కలి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వం ఆవశ్యకత, దానివల్ల కలిగే ప్రయోజనాలపై మంగళవారం కోర్టు ఆవరణలో జూనియర్ సివిల్ న్యాయాధికారి ఆర్.తేజా చక్రవర్తి న్యాయవాదులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దివ్వల వివేకానంద, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

కొత్తూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మానవ హక్కులు, చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని కొత్తూరు జూనియర్ సివిల్ న్యాయాధికారి రాణి అన్నారు. మంగళవారం మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా కోర్టు ఆవరణలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాదులు రఘునాథ్, రాడ రాజు తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కులను పరిరక్షించాలి

నరసన్నపేట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మానవ హక్కుల పరిరక్షణకు ప్రతీ ఒక్కరు పాటు పడాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.పి.లత అన్నారు. మంగళవారం మానవహక్కుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్వేచ్ఛ, స్వాతంత్ర్యం ప్రతీ ఒక్కరికి ఉందన్నారు. పంచాయతీ కార్యాలయం వద్ద మానవహారం చేపట్టారు.

నీటి సంఘాలకు ఔత్సాహికులను ప్రోత్సహిద్దాం: ఎంజీఆర్


టీడీపీ నేతలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నీటి సంఘాల ఎన్నికల్లో సమర్థులైన ఔత్సాహికులను ప్రోత్సహిద్దామని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గం పరిధిలోని ఐదు మండలాల టీడీపీ నేతలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలో మేజర్, మైనర్ కలిసి 76 సంఘాలు, 502 టీసీలకు ఎన్నికలకు సమాయత్తం కావాలన్నారు. వైసీపీ ప్రభుత్వంలో సాగునీటి వ్యవస్థను పట్టించుకోని కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఈ సందర్భంగా నేతలతో ఎన్నికల విషయమై చర్చించారు. కార్యక్రమంలో ఐదు మండలాల నాయకులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోండి

● ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులను ప్రభుత్వం నిర్వహిస్తోందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మంగళవారం మడపాం గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన లాండ్ టైటిల్ యాక్టును రద్దు చేసి రైతులకు పూర్తిస్థాయిలో భూ హక్కులను కల్పించడంతో సీఎం చంద్రబాబునాయుడు కృషి చేశారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు శిమ్మ చంద్రశేఖర్, నేతలు అడపా చంద్రశేఖర్, చింతు రాజన్న, గొద్దు సుందరరావు, మండల ప్రత్యేకాధికారి అనూరాధ, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో బి.మధుసూదనరావు, సర్వే అధికారులు పాల్గొన్నారు.

'గరిమెళ్ల' రచనలు పాఠ్యాంశంగా చేర్చాలి


గరిమెళ్ల కవితా స్రవంతి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

పోలాకి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ గేయకవి, స్వాతంత్ర్య సమరయోధుడు గరిమెళ్ల సత్యనారాయణ రచనలు, గేయాలు పాఠ్యాంశంగా చేర్చాలని అభ్యుదయ రచయితల సంఘం (అర సం) జిల్లా అధ్యక్షుడు నల్లి ధర్మారావు కోరారు. మంగళవారం ప్రియాగ్రహారంలో గరిమెళ్ల మెమోరియల్‌ట్రస్ట్, అరసం, ప్రగతిసాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గరిమెళ్ల పాడిన గేయాన్ని ఆదర్శంగా తీసుకుని ధర్మారావు రూపొందించిన 'మాకొద్దీతెల్లదొరతనమూ..' అనే నాటిక సంపుటిని ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎస్.విశ్వేశ్వరరావు ఆవిష్కరించారు. విజయనగరం జిల్లా అరసం కార్యదర్శి రత్నాల బాలకృష్ణ రచించిన 'గరిమెళ్ల కవితా స్రవంతి' పుస్తకాన్ని కళాశాల ప్రిన్సిపాల్ నాగమణి ఆవిష్కరించారు. గరిమెళ్ల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ప్రియాగ్రహారం ప్రగతి సాహితీ సమితీ అధ్యక్షుడు ఇలపండ గణపతిరావు, అరసం సభ్యులు బద్రి కూర్మారావు, చింతాడ కృష్ణారావు, గరిమెళ్ల జయంతి కమిటీ నాయకులు బాడాన రాజు, దుబ్బక కోటేశ్వరరావు, జర్నలిస్టులు ఎన్.ఈశ్వరరావు, ఎంవీ మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ విత్తనాలను శుద్ధి చేసుకోవాలి

కోటబొమ్మాళి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రబీలో రైతులు వేయనున్న వేరుశనగ విత్తనాలను ట్రైకో డెర్మాతో శుద్ధి చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి కె.త్రినాథ స్వామి అన్నారు. మంగళవారం తర్లిపేట గ్రామ సచివాలయ పరిధిలో 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేజీ వేరుశనగ విత్తనాలకు 5-8 కేజీల ట్రైకోడెర్మాతో శుద్ధి చేయాలని, దీనివల్ల పంటకు కాలర్‌రాట్ వ్యాధి సోకినా మొక్కలు చనిపోకుండా ఉంటాయన్నారు. ఎకరాకు 60 కేజీల విత్తనాలను వేసుకోవాలని, చదరపు మీటర్‌కు 33 మొక్కలు ఉండేటట్లు చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో టెక్కలి ఏడీఏ బీవీ తిరుమలరావు, వ్యవసాయాధికారి ఎస్.గోవిందరావు, రైతులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

టెక్కలి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రావివలస సమీపంలోని 220/132/33కేవీ సబ్ స్టేషన్‌లో వార్షిక మరమ్మతుల నేపథ్యంలో బుధ, గురువారాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని టెక్కలి ట్రాన్స్‌కో ఈఈ జి.శంకరరావు, పలాస ఈఈ జి.యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. గరివిడి నుంచి వచ్చే విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా రెండు రోజులు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పీఎంఏవైని సద్వినియోగం చేసుకోండి

వజ్రపుకొత్తూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) పథకంలో ఇళ్లు లేని పేదలకు ఇంటి నిమిత్తం రుణాలందిస్తున్నారని, ఈ పథకాన్ని వినియోగించుకోవాలని సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలాఫీసర్ సీహెచ్ మల్లేశ్వరరావు అన్నారు. మంగళవారం వెలుగు కార్యాలయంలో మహిళలతో సమావేశం నిర్వహించారు. అర్హులైన వారు సంబంధిత పత్రాలతో సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి సాయం



పలాస, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): దానగొర గ్రామానికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ ఎస్.జోక్యో మృతి చెందడంతో ఆయన కుటుంబానికి ఎస్పీ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు జిల్లా పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.కృష్ణంనాయుడు, కోశాధికారి కె.భుజంగరావు మంగళవారం రూ.లక్ష చెక్కును అందించారు. జిల్లా పోలీస్ డెత్ రిలీఫ్ ఫండ్ నుంచి ఈ మొత్తం అందజేశారు. జోక్యో ఈనెల 2న మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని సంఘ సభ్యులు పరామర్శించి ఓదార్చారు.

కంటి శస్త్రచికిత్సలకు 18 మంది ఎంపిక

హరిపురం, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహిస్తున్న కంటి వైద్యశిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ సీనియర్ నాయకులు కొర్ల కన్నారావు అన్నారు. హరిపురంలో గాయత్రి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యులు సాయి, సమీర్, భాగ్యలక్ష్మి, గీతాశ్రీ 102మందికి పరీక్షలు నిర్వహించి 18 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో మార్పు వెంకటేశం, కొంచాడ సురేష్, మధుబాబు పాల్గొన్నారు.

చోరీ కేసులపై పోలీసుల ఆరా

నరసన్నపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో జరిగిన పలు చోరీ కేసులకు సంబంధించి వెండి ఆభరణాలు నరసన్నపేటలో వెండి వ్యాపారులకు విక్రయించినట్లు చోరీలకు పాల్పడిన వ్యక్తులు ఇచ్చిన సమాచారం మేరకు మంగళవారం పోలీసులు సంబంధిత వ్యాపారులను ఆరా తీసినట్లు సమాచారం. సుమారు 8 కేజీల వెండి ఆభరణాలు ఒక వ్యాపారి చోరీకి పాల్పడిన వ్యక్తి నుంచి కొనుగోలు చేసినట్లు తెలిపిన సమాచారం మేరకు పోలీసులు సదరు వ్యాపారిని అదుపులో తీసుకున్నట్లు తెలుస్తుంది. ఈ వ్యవహారంపై నరసన్నపేట బంగారం వ్యాపారులు కొందరు పోలీసు స్టేషన్‌కు చేరుకోవడం చర్చనీయాంశమైంది.

స్ఫూర్తిప్రదాత ఆల్ఫ్రెడ్ నోబెల్

పాతపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అత్యున్నత పురస్కారం నోబెల్ బహుమతి పొందిన ఆల్ఫ్రెడ్ నోబెల్ అని హెచ్ఎం ఎస్.వైకుంఠరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆల్ఫ్రెడ్ నోబెల్ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. డైనమెట్ వంటి ప్రతిష్ఠాత్మక పరిశోధనలో రాణించి దేశానికి కీర్తి సంపాదించారన్నారు.

ఇళ్ల నిర్మాణాలువేగవంతం చేయాలి

నరసన్నపేట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మంజూరు చేసిన గృహ నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని ఏఈ రాజేంద్రప్రసాద్ సూచించారు. మంగళవారం ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షించారు.